క్లుప్తంగా

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫారం శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో గాయాలపాలై మృతి చెందినట్టుగా గుర్తించారు. రైలు నుంచి పడడంతో తలకు బలమైన గాయాలు, శరీరంలో రగుడు గాయాలు కావడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎవరైనా గుర్తిస్తే 99895 70010 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రవి వర్మ కోరారు.

22 మందికి జరిమానా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి జరిమానాలు విధించగా, వారిలో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బుధవారం వీరిని 3వ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ 2 క్లాస్ కోర్టు టి.వి.రమణ మూర్తి ఎదుట హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.3 వేల నుంచి రూ.7 వేలు జరిమానా విధించారు. వీరిలో లారీ డ్రైవర్ శ్రీనివాసరావుకు జరిమానాతో పాటు 7 రోజుల జైలు శిక్ష, ఆటో డ్రైవర్ రాజు బాబుకు జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. 22 మందికి కలిపి మొత్తం రూ.75,100లు జరిమానా విధించినట్టు చెప్పారు.

బకాయిలు జమ చేయాలని వినతి

ఉక్కునగరం: త్రిఫ్ట్ సొసైటీకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే జమ చేయాలని త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద ధర్నా చేశారు. ధర్నాకు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్, టాటాలకు వడ్డీతో చెల్లిస్తున్న యాజమాన్యం త్రిఫ్ట్ సొసైటీకు బకాయిపడ్డ రూ. 60.24 కోట్లను 12 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ. 370 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న త్రిఫ్ట్ సొసైటీను ఆర్థికంగా దెబ్బతీయాలని యాజమాన్యం చూస్తే సహించబోమన్నారు. అనంతరం పే సెక్షన్ డీజీఎం రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఆనంద్‌కుమార్, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన

మహారాణిపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆచార్య టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా షారోన్‌రాజ్ మాట్లాడుతూ ఇటువంటి అతి హేయమైన, భయానకమైన ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ రాము, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

అల్లిపురం: అనాథ వ్యక్తి మృతదేహానికి 33వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరపల్లి రాము అంత్యక్రియలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. 33వ వార్డులో అనాథగా ఉంటున్న కిలిమి పోలయ్యను గత నెల 29న ఏయూటీడీ భీమ్‌నగర్ నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అతడు బుధవా రం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పచ్చిరిపల్లి రాము అక్కడికి చేరుకుని కిలిమి పోలయ్య మృతదేహాన్ని చావులమదుం శ్మశానవాటికకు తీసుకువెళ్లారు. పి.వి.ఎస్.రెడ్డి, రామలింగంలతో కలిసి ఆయన అనాథ శవానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

బాబోయ్ భౌ



- హడలెత్తిస్తున్న గ్రామసింహాలు
- వెంటాడి గాయపరుస్తున్న వీధికుక్కలు
- పట్టించుకోని అధికారులు
- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని వినతి



40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో కుక్కల స్వైర విహారం

పారిశ్రామిక ప్రాంతంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వారిని వెంటాడి మరీ గాయపరుస్తున్నాయి. నిత్యం ఏదోక ప్రాంతంలో గ్రామ సింహాల దాడిలో గాయపడుతున్న కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వీధుల్లోకి రావాలంటే హడలిపోతున్నారు. అయినా అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నెల	నమోదైన కేసులు
జూన్	15
జూలై	23
ఆగస్టు	21



63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన మహిళ



వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, త్రినాథపురం తదితర ప్రాంతాల్లో శునకాలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని కుక్కలు వెంబడించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. కుక్కలను ఏరివేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణ లేకపోవడం వల్లే అనర్థాలు

పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో వీధి కుక్కల నియంత్రణపై అధికారులుదృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను గుర్తించి వాటిని డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకుని, పశుసంవర్ధక శాఖ వైద్యులు కుక్కలకు వేసెక్టమి ఆపరేషన్లు చేయించడం, రేబిస్ వ్యాక్సిన్లు వేయించడం వంటి చర్యలు చేపట్టటడం లేదు. అది ఖర్చుతో కూడుకున్న పని కావడం, పైగా కుక్కలను తీసుకువచ్చి ఆపరేషన్‌కు ముందు, తర్వాత వాటి సంరక్షించాల్సిన బాధ్యత ఉండడంతో కుక్కలను నియంత్రించడం సాధ్యం కాదనే సాకుతో చేతులెత్తేసి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. జీవీఎంసీ యంత్రాంగం పట్టించుకోక పోవడంతో కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు అన్నట్టు పశుసంవర్ధక శాఖ వీధికుక్కల నియంత్రణ మాకెందుకులే అన్నట్టు పట్టించుకోకవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్

వీధి కుక్కల దాడితో గాయపడిన వారికి వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేయడం వల్ల కొంతవరకు ప్రమాదాన్ని అరికట్టవచ్చు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీ యూపీహెచ్‌సీలో సుమారు 60 రేబిస్ వ్యాక్సిన్లు, 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 70, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 200 వరకు రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

బయటకు వెళ్లాలంటే భయం



మా ప్రాంతంలో వీధి కుక్కలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు బయటకు వెళ్లినా గుంపులుగా తిరుగుతూ ఒకేసారి దాడి చేస్తున్నాయి. ఇటీవల మా వీధిలో ఓ మహిళ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెంబడించి మరీ ఆమెను గాయపరిచాయి. అప్పటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని వీధి కుక్కలను అరికట్టాలి.

-సుజాత, ప్రకాష్‌నగర్

అధికారులు స్పందించాలి



ప్రజలపై వీధి కుక్కల దాడులు అధికమవుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఎక్కడి నుంచో కుక్కలు తీసుకువచ్చి మరీ మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. ఆ కుక్కలు చిన్నపిల్లలు వీధుల్లోకి రాగానే వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. వాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు విన్నవించినా కుక్కల నియంత్రణకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

- సత్యారావు, 63 వ వార్డు

ఘనంగా ఐఎన్ఎస్ సుమిత్ర 10వ వార్షికోత్సవం



10వ వార్షికోత్సవంలో పాల్గొన్నఐఎన్ఎస్ సుమిత్ర సిబ్బంది

సింథియా: తూర్పు నావికాదళానికి చెందిన పెట్రోలింగ్ వెసెల్ ఐఎన్ఎస్ సుమిత్ర 10వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సముద్ర కార్యాచరణలో భాగంగా ఈ నౌక పలు దేశాల్లో జరిగిన విన్యాసాల్లో పాల్గొంది. ఐఎన్ఎస్ సుమిత్ర టీమ్‌కి నేవీ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?



గోతులమయంగా నరవ రోడ్డు



పాతగోపాలపట్నం వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా గోతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89, 91వ వార్డుల్లో పలు చోట్ల రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రమాదకరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. 91వ వార్డు పాత గోపాలపట్నం వెళ్లే రహదారిలో రైల్వే అండర్ పాస్‌వే ముందు రోడ్డు కోరుకుపోయి గొయ్యిలా ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే 89వ వార్డు నరవ వెళ్లే రహదారిలో రోడ్డు ఇరు పక్కలా కోరుకు పోయింది. రోడ్డు మధ్యలో పెద్దగోతులు ఏర్పడ్డాయి. వాహన చోదకులు ఆదమరిచి గోతుల్లో పడడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేత్రదానంపై అపోహలు వద్దు

సీతంపేట: నల్ల గుడ్డు అంధత్వం బారినపడి అనేక మంది చూపు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆప్తాల్మజీ హెడ్ డాక్టర్ ప్రభాకర శాస్త్రి పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోయేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్, హెడ్ నర్స్ రాజేశ్వరి, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్ను తగ్గింపుపై అజెండాలో పెట్టండి

డాబాగార్డెన్స్: ఆస్తి పన్ను తగ్గింపు, ఆస్తి విలువ ఆధారిత పన్ను రద్దు, చెత్తపై యూజర్ చార్జీల రద్దు విషయమై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం నగర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10న నిర్వహించే సమావేశంలో ప్రస్తుత నివాస భవనాల ఆస్తి పన్ను పరిధి 0.13 శాతం నుంచి 0.10 శాతానికి, నివాసేతర భవనాలకు 0.30 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గింపుకు తీర్మానం చేయాలని కోరారు. చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు విషయమై కూడా తీర్మానించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను తగ్గిస్తామని, సమీక్షిస్తామని, చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనలకు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు మద్దతిస్తారని భావిస్తున్నామని, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా సీపీఎం ప్రతిపాదనలు బలపరుస్తారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

వేడుకగా పందిరి రాట మహోత్సవం

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పందిరిరాట మహోత్సవంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52 వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో బుధవారం పందిరిరాట మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆలయ కమిటీ సభ్యులతో శాస్త్రోక్తంగా పూజలు చేయించి పందిరి రాటను ప్రతిష్ఠింపజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ వరసిద్ధి వినాయక మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రతిరోజు ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చన, నీరాజనం, మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ, ప్రత్యేక అలంకరణ జరుగుతాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ ఐ.వి .శంకరారావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష, శివప్రసాద్, ట్రెజరర్ సత్యనారాయణ, సభ్యులు సునీత, రత్నకుమారి, రమా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా కాలనీ వాసులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. లీడర్ రమణ మూర్తి సహకారంతో ఆలయ కమిటీ పెద్దలు వీటిని పంపిణీ చేశారు.

విద్యార్థులకు మొక్కల దత్తత



కొత్తపాలెం హైస్కూల్‌లో నాటిన మొక్కలను విద్యార్థులకు దత్తత ఇస్తున్న భూషణం మాస్టారు

గోపాలపట్నం: మొక్కలు నాటడం ఎవరైనా చేస్తారు. కాని వాటిని సాకడం బాధ్యతతతో కూడిన పని... ఆ బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు.. పర్యావరణ ప్రేమికుడు భూషణం మాస్టారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసినా సామాజిక కార్యక్రమాలు మాత్రం కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కొత్తపాలెం హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేట్టారు. వాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. వాటికి ప్రతీ రోజు నీరు పోయడం, పశువులు పాడు చేయకుండా కనిపెట్టాలని సూచించారు. మొక్కలను రక్షించేందుకు రక్షణగా ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను కోరనున్నట్టు భూషణం మాస్టారు తెలిపారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతో ఉత్పత్తికి గండి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పరిరక్షణ కమిటీ నాయకుడు రామస్వామి

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్లక్ష్యంగా కారణంగా సంస్థలో కేవలం బీఎఫ్–3లోనే ఉత్పత్తి సాగుతుందని విశాఖ ఉక్కు ఉరిరక్షణ కమిటీ నాయకులు యు.రామస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన 1301వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు.రెండు రోజులుగా కేవలం ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌లో మాత్రమే ఉత్పత్తి సాగుతుందని, అదీ కూడా తక్కువగా ఉత్పత్తి చేస్తున్నారని, దీనికి యాజమాన్యం నిర్లక్ష్య ధోరణే కారణమన్నారు. జీతాలు సకాలంలో చెల్లించకుండా కార్మికులను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీన రాస్తారోకోతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కా ర్యక్రమంలో స్టీల్ సీటూ నాయకులు కె.గంగాధర్, వీరస్వామి, పీజేకేరాజు, డీఎస్‌వీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉక్కు హెచ్‌ఆర్ అధికారి రాధికకు జాతీయ అవార్డు



నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉక్కు అధికారి రాధిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డీజీఎం డాక్టర్ దాసరి రాధిక జాతీయస్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ కాంక్లేవ్ 2024లో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. పనిలో నిజమైన నాయకురాలిగా, స్టీల్‌ప్లాంట్‌లో క్లిష్టమైన జోన్లలో పని చేయడంతో పాటు సమ్మిళిత సంస్కృతిని కల్పించేందుకు ఆమె చేసిన కృషికి గుర్తింపుగా జెండర్ డైవర్సిటీ అవార్డును ప్రకటించారు. ఉక్కు పరిశ్రమకు చెందిన పలువురి సమక్షంలో కేంద్ర ఉక్కుమంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి నాగేంద్ర సిన్హా చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ఆమెను అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ నూతన అధికారులకు సత్కారం



స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జ్ మధుసూదనరావును సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి, ఎస్సీ లైజన్ ఆఫీసర్లను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ నాయకులు సత్కరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా ఎం.మధుసూదనరావు, ఎస్సీ లైజన్ ఆఫీసర్‌గా నల్లి సుందరం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు బుధవారం వారిని కలిసి తమ సమస్యలు వివరించారు. గత ఏప్రిల్ నుంచి పదవీ విరమణ చేసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీం అమౌంట్ చెల్లించలేదన్నారు. ఈనెల 12తో ప్రస్తుత అసోసియేషన్ కమిటీ గుర్తింపు గడువు ముగుస్తున్నందున.. నూతన కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. స్టీల్‌క్లబ్ సంయుక్త కార్యదర్శి జి.సురేష్, సీనియర్ నాయకులు కొమ్ము ప్రసాదరావు, బి.డేవిడ్, ఆర్.కోటేశ్వరరావు, బలరామ్, గోపాల్, చింతా మోహన్‌రావు, జె.కె.ఎస్.నాథన్, అరవింద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, 13.7 కేజీల సరకును స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ రైల్వే స్టేషన్‌లో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జూలి కర్మాకర్ తనిఖీల్లో కేరళకు చెందిన వివేక్ వద్ద గంజాయిని గుర్తించారు. అతను 13.7 కిలోల గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జీఆర్పీ ఎస్ఐ వి.రవివర్మకు అప్పగించారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.